ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- శ్రీకాకుళం జిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- సాంకేతిక సదుపాయాలను సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా నేరాలను నియంత్రించగలమని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- పోషకాహార లోపం, శిశు మరణాల వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని నీతి ఆయోగ్ సభ్యులు వీ.కే సారస్వత్ కోరారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- నైరుతి పశ్చిమ గాలుల ప్రభావంతో రాష్ట్రంలో రేపు పలు జిల్లాలలో తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

==================

అన్ని రంగాలలో అగ్రగామి జిల్లాగా శ్రీకాకుళంను తీర్చిదిద్దుతున్నామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలంలోని బూరగాం గ్రామంలో 265 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఉద్దానం రెండవ దశ మంచినీటి సరఫరా పథకానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీరు, త్రాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. పాతపట్నం నియోజక వర్గ అభివృద్ధి కోసం గత ఏడాదిలో 290 కోట్ల రూపాయలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

==================

సాంకేతిక సదుపాయాలను సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా నేరాలను నియంత్రించగలమని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈరోజు సురక్ష 360 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి మాట్లాడుతూ.. శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఆపదలో ఉన్న వారు వాట్సాప్ నెంబర్‌కు ఒక్క మెసేజ్ చేస్తే పోలీసులు వెంటనే అప్రమత్తం అవుతారని హోంమంత్రి తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

==================

శాస్త్ర పరిశోధనల ద్వారా పోషకాహార లోపం, శిశు మరణాలు, మాతృ మరణాలు వంటి సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉందని నీతి ఆయోగ్ సభ్యులు వీ.కే సారస్వత్ అన్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ సహకారంతో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయంలో ఈరోజు నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సదస్సులో ఆయన పాల్గొన్నారు. వికసిత భారత్-2047 కోసం పరిశోధనలు, నవీకరణలను ఉపయోగించటం అనే అంశంపై ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. వికసిత భారత్ అనేది అభివృద్ధి చెందిన దేశం కోసం రూపొందించిన మార్గసూచిక అని చెప్పారు. సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధ మొదలైన అంశాలలో పరిశోధనల ద్వారా స్వయం సమృద్ధి సాధించి, ఆత్మ నిర్భర భారత్ గా మారాల్సిన అవసరం ఉందని అన్నారు.

===================

పేదల కోసం నిర్మించే ఇళ్ళ విషయంలో నాణ్యత, ప్రమాణాలను పాటించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ లో ఈరోజు నిర్వహించిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై ఆయన సమీక్షించారు. పేదలు నివాసం ఉండే కాలనీలలో కనీస వసతులతో పాటు మౌలిక సదుపాయాలని సైతం కల్పించాలని ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

===================

విరామం

===================

భారత పూర్వ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు నివాళులర్పించారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతిని మార్చాయని ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. పీవీ నరసింహారావు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు.

===================

ప్రసార భారతి సౌత్ జోన్ పరిధిలో ఒప్పంద ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంపిక అయిన వారు టెక్నికల్ ఇంటెర్న్స్ గా పూర్తి స్థాయి కాంట్రాక్ట్ విధానంలో ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల్లో పని చేయాల్సి ఉంటుంది. ఏడాది పాటు కాంట్రాక్ట్ విధానంలో ఈ పోస్టులకు ఎంపిక చేస్తారు. అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండి, ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ గాని మాస్టర్ డిగ్రీ లేదా తస్సమాన విద్యను అభ్యసించి ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా ఈ పోస్టులకు అర్హులని ఆ ప్రకటనలో పేర్కొంది.

===================

మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ పిల్లలకు అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం వచ్చిన 22 దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ ఛాంబర్ లో ఈరోజు ఆయన అధ్యక్షతన స్పాన్సర్షిప్, ఫాస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో హెచ్ఐవీ, కరోనా ప్రభావిత 388 అనాథ పిల్లలకు నెలకు 4000 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

===================

రాష్ట్రంలోని ధాన్యం తదితర పంట ఉత్పత్తుల సేకరణతో పాటు కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్న తీరును భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కమిటీ ఛైర్మన్, నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈరోజు సమీక్షించారు. విజయవాడలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (FCI) రాష్ట్ర స్థాయి కన్సల్టేటివ్ కమిటీ (SLCC) ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి, ఆహార ధాన్యాల సేకరణలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు.

===================

రాష్ట్రంలో గత ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్ సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో స్థానిక జూనియర్ కళాశాల వద్ద 62 లక్షల రూపాయలతో ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ కు హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారధితో కలిసి ఆమె ఈ రోజు భూమి పూజ చేశారు.

===================

మచిలీపట్నంలో 165 కోట్ల రూపాయల వ్యయంతో మురుగు నీటి వ్యవస్థను ఆధునీకరిస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం 17వ డివిజన్ లో 35.16 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు ఈరోజు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 165 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆ నిధులు రాగానే పనులు చేపడతామన్నారు. అదే విధంగా అక్టోబర్ రెండో తేదీ నాటికి స్థానిక డంపింగ్ యార్డ్ ను సుందరమైన పార్కుగా తీర్చిదిద్దుతామన్నారు.

===================

గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత శ్రమించే మనస్తత్వంతో పాటు తగిన అర్హతలు కలిగి ఉంటే ఉద్యోగం లభిస్తుందని చెప్పారు.

===================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి మరియు పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాగల మూడు రోజుల పాటు ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు ఇతర జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...32 సెకన్లు)

===================

===================